క్లుప్తంగా

గ్రామ సభలు నిర్వహించాలని వినతి



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్‌పై గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కేంద్రం ప్రభుత్వం ఐదో కాంటూరు పైన 10 కిలోమీటర్ల వరకు పర్యావరణం పేరుతో 26 నిబంధనలు పెట్టి వేలాదిమంది ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందని తెలిపారు. దీంతో ఆ ప్రాంత దళితులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, మత్స్యకారులు, ఇతర వృత్తిదారులకు తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రజల కంటే పక్షులకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని కలెక్టర్ హామీ ఇచ్చారని నాయకులు పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎ.రవి (సీపీఎం), ఘంటసాల వెంకటలక్ష్మి (జనసేన), రాజనాల రామ్మోహన రావు (కాంగ్రెస్), షేక్ మస్తాన్ వలీ (అమీఆ ద్మీ), వివిధ సంఘాల నాయకులు ఎస్.నాగరాజు, కె.శ్రీనివాస్, పిచ్చుక ఆదిశేషు, తాతపూడి చందు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ ప్రభాకరరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఏలూరు టూ టౌన్ సీఐ ఎం ప్రభాకరరావు అన్నారు. శనివారం స్థానిక పీడీబీటీ కళాశాలలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రభాకరరావు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, దానివల్ల ప్రమాద సమయంలో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడొచ్చన్నారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారు హెల్మెట్ ధరించేలా, రహదారి భద్రత నియమాలు పాటించేలా అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఎస్సై సాధిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సాధికారత

ఎమ్మెల్యే ఆళ్ల నాని



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనతో సామాజిక, సాధికారతకు బాటలు వేశారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. 132వ రోజు ఏలూరు వన్‌టౌన్‌లోని 7వ డివిజన్‌లో కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే నాని వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ పథకాల అమలుపై ఆరా తీశారు. అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో సామాజిక విప్లవం వచ్చిందన్నారు. వివక్షతకు తావులేకుండా అన్ని వర్గాల సమాగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని వివరించారు. రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా ఉండాలని ప్రజలను కోరారు. ఏలూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు తెలిపిన సమస్యల పరిష్కారానికి అధికారులను ఎమ్మెల్యే నాని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ, తహసీల్దార్ బి.సోమశేఖర్, పలువురు కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రలో భాగస్వాములు కావాలి



కార్యదర్శులకు క్రీడా పరికరాలు అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ, సచివాలయ కార్యదర్శులకు క్రీడా పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బాలబాలికలతో పాటు యువతీ యువకులను ఉత్సాహ పరిచేందుకు ప్రభుత్వం డిసెంబర్ 15 నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలతో పాటు స్థానిక సంస్థల సభ్యులు ప్రతిఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని చెప్పారు. మొదట సచివాలయాల స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఇందులో విజయం సాధించిన జట్లు మండల స్థాయిలో పోటీ పడతాయన్నారు. అక్కడ నుంచి విజేత జట్లు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. విజేతలకు ప్రభుత్వం భారీ మొత్తంలో నగదు బహుమతులు అందిస్తుందన్నారు. ఎంపీడీఓ బి.ప్రణవి మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, కబడ్డి, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగాల్లో మహిళలు, పురుషులకు వేరువేరుగా పోటీలు చేపడతామని తెలిపారు. ఇప్పటి వరకు 900 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ప్రతి సచివాలయానికీ మూడు క్రికెట్ కిట్లు, మూడు వాలీబాల్స్‌తో కూడిన 1 నెట్, రెండు టెన్నీకాయిట్స్ 1 నెట్, బ్యాడ్మింటన్ నెట్‌తో పాటు నాలుగు బ్యాట్లు అందిజేస్తున్నామని చెప్పారు. పోటీల నిర్వహణకు సచివాలయ ఉద్యోగులు, పీఈటీలు, మండల స్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. 15 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ప్రజాస్వామ్యంలో ఓటే అతి బలమైన ఆయుధమని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. శని, ఆదివారాల్లో నిర్వహిస్తోన్న ప్రత్యేక ఓటరు కార్యక్రమ తీరును శనివారం ఆయా కేంద్రాల్లో కలెక్టర్ పరిశీలించారు. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని కస్తూరిబా నగరపాలక ఉన్నతపాఠశాల, బీజీపీఓ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, చాటపర్రు శ్రీమాగంటి ఆంజనేయ సత్యవతి జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహిస్తున్న ఓటరు నమోదు క్యాంపెయిన్‌లోని కేంద్రాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఫారం-6, -7, -8 వచ్చినప్పుడు సమాచారాన్ని పూర్తిగా పరిశీలించి నమోదు చేయించాలని బీఎల్ఓలను ఆదేశించారు. ఆధార్ కార్డులో ఉన్న పుట్టినతేదీ ఆధారంగానే ఓటరు నమోదును నిర్ధారించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డిసెంబర్ 9వతేదీలోగా అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకొనేలా ఆటోలో మైక్ ద్వారా, పారిశుధ్యం వాహనాల మైకుల ద్వారా ప్రచారం చేపట్టాలని ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనరు వెంకటకృష్ణను ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏలూరులో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ స్టేషన్ల పనులను కలెక్టర్ పరిశీలించారు. ఓటరు నమోదుకు మరింత సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబరు 1950కు డయల్ చేయవచ్చని సూచించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ బాపిరాజు, తహసీల్దార్లు బి.సోమశేఖర్, శ్రీనివాస్, బూత్ లెవల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో తెలుగింటి రుచులు



డిగ్రీ కళాశాలలో తెలుగింటి రుచులు స్టాల్స్‌ను సందర్శిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని గుర్తించేందుకు, నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి, సామరస్యతను నెలకొల్పడానికి ఉద్దేశించి తెలుగింటి రుచుల మేళాను ఏర్పాటు చేశామని ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన తెలుగింటి రుచులు మేళాను కళాశాల సీపీడీసీ కార్యదర్శి యిరదల రఘుబాబు శనివారం మధ్యాహ్నం ప్రారంభించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గిరిబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడానికి, మానసిక వికాసానికి, వినోదం పంచడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో వివిధ తరగతుల విద్యార్థులు విభిన్నమైన ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శకులను ఆకర్షించాయి. కార్యక్రమంలో బోధన సిబ్బంది కె.అజయ్ కుమార్, సీహెచ్ ఉదయలక్ష్మి, వి.వెంకటరావు, ఎం విజయ కుమార్, ఎస్ పరమేశ, ఎం రాంబాబు, టీపీఎస్ పద్మావతి, ఎం కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో ఏఐటీయూసీ జిల్లా మహాసభలు

ఏలూరు (టూటౌన్): ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ ఏలూరులో ఈ నెల 9,10 తేదీల్లో నిర్వహించనున్నట్టు జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు, కె.కృష్ణమాచార్యులు తెలిపారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో శనివారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలపై కార్మిక చట్టాల మార్పు అంశంపై మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మహాసభకు ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులు 500 మంది హాజరవుతున్నట్టు చెప్పారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడారు. ఏఐటీయూసీ నాయకులు రెడ్డి శ్రీనివాస డాంగే, డి.లక్ష్మణ్ మూర్తి, పుప్పాల కన్నబాబు పాల్గొన్నారు.

పుస్తకాలతో స్నేహం విజ్ఞానానికి మార్గం



పుస్తకాలను తిలకిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్సీ సాబ్జీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పుస్తకాలతో స్నేహం చేస్తే విజ్ఞానానికి రాజమార్గం ఏర్పడుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చీర్ల పద్మశ్రీ అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనశాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల ద్వారా ప్రజల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు, ఉద్యోగార్థులు పుస్తక పఠనం ద్వారా జ్ఞాన సముపార్జన చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనశాలలో అనేక అంశాలకు సంబంధించిన పుస్తకాలు, గ్రంథాలను అందుబాటులో ఉంచడం విశేషమన్నారు. ప్రదర్శన శాల నిర్వాహకుడు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు సాహిత్యాన్ని చేరువ చేయాలని, పుస్తకాల వైపు వారి దృష్టిని మరల్చడానికి మహనీయుల జీవిత చరిత్రల పుస్తకాలతో పాటు అనేక ఆధ్యాత్మిక, జ్యోతిష్య, ఆయుర్వేద, వాస్తు గ్రంథాలతో పాటు నేటి సమాజానికి అవసరమైన కంప్యూటర్, పుస్తకాలు, న్యాయ, చట్ట సంబంధిత పుస్తకాలు, వ్యక్తిత్వ వికాస పుస్తకాలు తదితర దాదాపు 3 వేల రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

దెందులూరు: పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని సినీగేయ రచయిత అనంత శ్రీరామ్ అన్నారు. శనివారం సానిగూడెంలో దెందులూరు, ఏలూరు నియోజకవర్గాల భారతీయ జనతాపార్టీ కుటుంబ సభ్యుల వనసమారాధన ఏలూరు పార్లమెంటరీ ఇన్‌ఛార్జి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సంఘటన మంత్రి మధుకర్‌జీ, రాష్ట్ర నాయకులు భూపతిరాజు శ్రీనివాసరాజు వర్మ, జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి రుద్రమకిషోర్, దెందులూరు నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి చైతన్య కృష్ణ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ, బీజేపీ అధ్యక్షుడు ఎం.బుజ్జిగోపాల్, సీనియర్ నాయకులు నాగం శివ, రెండు నియోజకవర్గాల మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ అభ్యంతరాలపై ప్రజావేదిక

పెదపాడు: సామాజిక తనిఖీలో 23 గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీలో రూ. 16,599 అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించామని డ్వామా పీడీ రాము చెప్పారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీలో భాగంగా 16వ విడత ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో సామాజిక తనిఖీలో భాగంగా ప్రజావేదిక నిర్వహించారు. ఈకార్యక్రమంలో డ్వామా పీడీ మాట్లాడుతూ ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి తరలించడంలో రూ.1,66,400 విలువైన సిమెంటుకు సంబంధించి ఆరా రావాల్సి ఉందన్నారు. పలు అంశాలపై రూ. 4,100 అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. రూ. 43,585 విలువైన కొన్ని పనులు పరిశీలించాల్సి ఉందన్నారు. మండలంలో మొక్కలు పెంపకం చేపడతామని చెప్పారు. సచివాలయ భవనాలకు రూ.2కోట్లు చెల్లించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఎంపీడీవో సూర్యకుమార్ పాల్గొన్నారు.

మనువాదులతో లౌకిక రాజ్యానికి ప్రమాదం



సదస్సులో మాట్లాడుతున్న రమాదేవి

ఏలూరు (టూటౌన్) : మనువాదులు అధికారంలోకి రావడంతో దేశంలో లౌకిక రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. స్థానిక ఐద్వా జిల్లా కార్యాలయంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి అధ్యక్షతన రాజ్యాంగం – మనువాదం – మహిళలు అనే అంశంపై శనివారం ఏర్పాటు చేసిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మనువాదులు(బీజేపీ) అధికారంలోకి వచ్చాక లౌకిక రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నారు. బీజేపీ మతోన్మాద శక్తులు మహిళలు, మైనార్టీలు, దళితులపై దాడులు చేస్తోందని తెలిపారు. ప్రజలు తినే ఆహారంపైనా, మహిళలు వేసుకునేబట్టలుపైనా ఆంక్షలు పెడుతోందని చెప్పారు. బీజేపీ తిరిగి దేశాన్ని వెనక్కి తీసుకెళ్లాలని చూస్తుందని అన్నారు. గుజరాత్ రాష్ట్రంలో బాల్కిన్ బావోలో గర్భిణీపై అత్యాచారం చేసిన ఘటనలో జైలుకు వెళ్లిన దుర్మార్గులను బీజేపీ విడుదల చేసిందని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, కరెంట్ తదితర చార్జీలు పెంచిందని తెలిపారు. ప్రజల్లో నిరుద్యోగం, పేదరికం పెరిగిందన్నారు. సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్, బి.సోమయ్య, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, ఎ.శ్యామలారాణి మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా సంఘం, ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు రాగాలా సరాగాలా కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న శరత్‌చంద్ర

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మధురగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతిని పురస్కరించుకుని నగరానికి చెందిన ఘంటసాల సంగీత కళాశాల, జిల్లా రచయితల సంఘం, ఘంటసాల స్వరపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో రాగాలా సరాగాలా కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఘంటసాల సంగీత కళాశాల వ్యవస్థాపకుడు టి.శరత్‌చంద్ర తెలిపారు. శనివారం ఏలూరులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. శతాబ్ది గాయకుణ్ణి స్మరించుకుందాం పేరిట ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఘంటసాల పాటల మాధుర్యాన్ని నేటి తరం కూడా ఆస్వాదిస్తోందంటే ఆయన సంగీతానికి, గాత్రానికి ఉన్న విలువ ఏమిటో తెలుపుతోందని అన్నారు. ఘంటసాలను ఆదర్శంగా తీసుకుని ఎంతోమంది గాయకులుగా తీర్చిదిద్దబడ్డారని వివరించారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగు సంగీతాన్ని, ఘంటసాలను వేరువేరుగా చూడలేమన్నారు. ఘంటసాలను స్మరించుకుంటూ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ప్రారంభమౌతుందన్నారు. కార్యక్రమంలో ఘంటసాల సంగీత కళాశాల అంతర్జాతీయ అధ్యక్షుడు మధు అన్నా, అంతర్జాతీయ మహిళా శిల్పి దేవికారాణి ఉడయార్ తదితరులు పాల్గొంటారన్నారు. సంగీత అభిరుచి ఉన్న వారు, ఘంటసాల అభిమానులంతా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఘంటసాల స్వరపీఠం ప్రతినిధి ఎస్ఎం సుభాని, వై.అర్జునరావు, కె.శ్రీవల్లి పాల్గొన్నారు.

జల సంఘాలు ఏర్పాటు చేయాలి



జల సంఘాల ఏర్పాటుపై సమీక్షిస్తున్న ఏపీఎం

పెదవేగి: జల్‌జీవన్ మిషన్‌లో మంజూరైన పనులను జల సంఘాలు పూర్తి చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ అన్నారు. శనివారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ విధానంపై జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆయన అవగాహన కల్పించారు. జల్ జీవన్ మిషన్‌లో మంజూరైన పనులను గ్రామ మహిళా సంఘ సభ్యులతో గ్రామ జల సంఘం ఏర్పాటు చేసి చేపట్టాలని నిర్ణయించామన్నారు. పనులు మంజూరైన ప్రతి గ్రామంలో గ్రామ జల సంఘం కమిటీ ఏర్పాటు చేయాలని, ఈ కమిటీలో సదరు పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, 9 మంది స్వయం సహాయక సంఘ సభ్యులు ఉంటారన్నారు. గ్రామ జల సంఘం పేరుతో బ్యాంక్ ఖాతా ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు పోతురాజు ఫాతిమా, మండల సమాఖ్య కార్యదర్శి ఇందేటి సువార్త, ఏపీఎం బి.శరత్ బాబు, పెదవేగి మండలం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా 120 మంది మండల సమాఖ్య, గ్రామా సంఘాల ప్రతినిధులు వీఓఏలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ అడిషనల్ డైరెక్టర్ ఎండీ షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల చింతలపూడి, నూజివీడు మండలాల్లో వంట వండుతూ ఒంటిపై గంజి పడి గాయపడిన వారు, విధులు ముగించుకుని తిరిగి వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై గాయపడిన వారికి ప్రభుత్వం చికిత్స చేయించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులు ఒక్కొక్కరికీ రూ.15 నుంచి రూ.20 వరకు చెల్లించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.18 వేలు జీతం, గుర్తింపు కార్డులు, యూనిఫారం ఇవ్వాలని, వంటగ్యాస్ సబ్సిడీపై సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాట్ల పుల్లారావు, ప్రధాన కార్యదర్శి కంకిపాడు బుచ్చిబాబు, నాయకులు ఎం స్వప్న, పి.రాజ్యలక్ష్మి, బి.భాగ్యం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రం.. భక్తజన సంద్రం

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. కార్తీకమాస పర్వదినాలు కావడంతో పాటు, స్వామివారికి ప్రీతికరమైన రోజు అవడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. దాంతో అన్ని విభాగాలు భక్తులతో కళకళలాడాయి. తూర్పురాజగోపుర ప్రాంతంలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా భక్తులతో నిండిపోయాయి. కేశఖండనశాల, నిత్యాన్నదాన భవనం, టికెట్, ప్రసాదాల కౌంటర్లు, దర్శనం క్యూలైన్లు భక్తులతో పోటెత్తాయి.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	13
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	18
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	04
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	02
ద్వారకాతిరుమల - ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	4822	02
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	12
ఏలూరు -తిరుపతి	16.00	4830	26

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	33	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	38	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	36	కంద	60
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	40
కాకర కాయలు	30-34	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	44	అల్లం	120
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	40-50	పాలకూర	10
దొండకాయలు	26	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	45-50	గోంగూర	06
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణీ	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30